## సమస్యల ప్రస్తావన..సాదర ఆహ్వానాలతో

# తెదేపా శ్రేణుల్లో ఉత్సాహం

గజపతినగరం, జూన్ 19 (న్యూస్‌టుడే): 'మీకోసం' యాత్రలో భాగంగా గజపతినగరం నియోజకవర్గంలో గ్రామాలు, ప్రాంతాల వారీగా ఎదుర్కొంటున్న సమస్యలపై చంద్రబాబు ప్రస్తావించడంతో ప్రజల్లో సంతృప్తి వ్యక్తమైంది. అర్ధరాత్రి దాటినా దారిపొడవునా కార్యకర్తలు, అభిమానుల సాదర ఆహ్వానాలతో 'బాబు' యాత్ర కొనసాగింది. నియోజకవర్గంలో రెండు రోజులపాటు 80 కిలోమీటర్ల యాత్ర సాగించారు. రాత్రి సమయాల్లోనే యాత్ర జరిగినప్పటికీ గ్రామాల్లో ప్రజలు భారీ ఎత్తున పాల్గొని అధినేతకు స్వాగతం పలికారు. అన్ని సభలు విజయవంతంకావడంతో నియోజకవర్గ నాయకుల్లో ఈ పర్యటన ఉత్సాహం నింపింది. గంట్యాడ, బొండపల్లి, గజపతినగరం, మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో ఎమ్మెల్యే అరుణతోపాటు ఆయా మండలాల నాయకులు చేసిన ఏర్పాట్లలో సఫలీకృతులయ్యారు.



గజపతినగరంలో మాట్లాడుతున్న చంద్రబాబు

### ప్రస్తావనకొచ్చిన సమస్యలివీ..

❑ తాటిపూడి జలాశయం నీటిని వ్యవసాయానికి ఉపయోగించేందుకు చర్యలు తీసుకోవడం

❑ ఆంధ్ర జలాశయం నీటిని బుడతానపల్లికి అందించేలా, హైలెవెల్ కెనాల్ పనులు జరిపి, చల్లపేట, కైలాం, జక్కువ గ్రామాలకు నీరందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

❑ బోడిమెట్ట, దేవుపల్లి జలాశయాల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు.

❑ గుర్ల గెడ్డ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి సాగునీరు అందేవిలా చర్యలు తీసుకోవడం.

❑ బుడతనాపల్లిలో పీహెచ్‌సీ ఏర్పాటు, దేవుపల్లిలో పీహెచ్‌సీ సిబ్బందికి భవనాలు నిర్మాణం, గ్రహపతి అగ్రహారం, మరువాడ రోడ్డు వేయించడం.

❑ దత్తిరాజేరు మండల గ్రామాలకు సరిపడా పెద్దగెడ్డ నీరు తీసుకురావడానికి ప్రయత్నం.

### రాష్ట్రస్థాయిలో చర్చకు వచ్చిన దేవుపల్లి

'మీకోసం' యాత్ర సందర్భంగా బొండపల్లి మండలం దేవుపల్లి గ్రామానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించింది. రాష్ట్రంలో తెలంగాణ సమస్య తీవ్రంగా చర్చ జరుగుతున్న దశలో తెదేపా కోర్ కమిటీ తెలంగాణ అంశంపై దేవుపల్లిలో మొదటిసారిగా సమావేశమైంది. రాష్ట్రానికి సంబంధించి కీలకమైన అంశాన్ని ఈ గ్రామంలో చర్చించడంతో ఈ పేరు అందరినోటా నానింది.